

# నాకొద్దు ఆ వారసత్వం

శాలివాహన

ఇంటికి వెనుక వైపున గల కొద్దిపాటి ఖాళీ స్థలంలో గుబురు గుబురుగా పెరిగిన ఒకే ఒక్క మామిడి చెట్టు క్రింద కూర్చొని అర్థిక శాస్త్రాన్ని చదువుతున్న రవి పుస్తకంలోంచి తల ఎత్తి చూశాడు.

తలపైన పడ్డ ముళ్ళరెమ్మ క్రిందకు జారి అతని ముందు పడింది. దాన్ని ఎడం చేతో తీసి దూరంగా విసిరి తిరిగి పుస్తకం పైకి మళ్ళించాడు రవి.

అప్పటి వరకు చెట్టుపైన కా కా మని అరుస్తున్న కాకి రివ్వున క్రిందికివచ్చి రవి విసిరిన ముళ్ళ రెమ్మను నోట కరచుకొని చెట్టుపైకి వెళ్ళిపోయింది.

కాకి కట్టుకుంటున్న గృహ నిర్మాణంలో ఒక ఇటుక ఆ ముళ్ళ రెమ్మ అని రవి కర్థమైంది.

ముళ్ళ రెమ్మలతో కట్టుకున్న గూటిలో ముళ్ళు గుచ్చుకోకుండా జాగ్రత్త పడుతూ కాపుర ముంటున్న ఆ కాకి నేర్పరితనానికి ఆశ్చర్యపోయాడు రవి. అడుగడుగునా ఎదురయ్యే కష్టాల్ని తొలగదోసుకుంటూ జీవితాన్ని అర్థవంతం చేసుకోవాలనే

సత్యాన్ని మనిషి గుర్తిస్తే ఎంత బాగుంటుంది! ముళ్ళులా గుచ్చుకొనే గతాన్ని పదే పదే నెమరు వేసుకుంటూ మరపు పొరల్లోకి వెళ్తున్న బాధల్ని తిరగదోడుకుంటాడెందుకో మనిషి!

తల్లి రూపం మనసులో మెదిలింది రవికి. ఆమె అంటూ వుంటుందెప్పుడూ "సుఖపడాలని కోరుకునే మనిషికెప్పుడూ కష్టాలే ఎదురవుతుంటాయి" అని.

సరిగ్గా అదే సమయంలో లోపల్నుండి జానకి పెరటి గుమ్మందాకా వచ్చి తొంగి చూసింది రవిని. తిరిగి లోపలికి వెళ్ళబోతూ "టీ పెట్టమంటావా రవీ?" అని అడిగింది.

రవి తల ఎత్తి చూశాడు.

ముగ్గు బుట్టలా తయారవుతున్న తల కట్టు, ముడతలు పడుతున్న శరీరం, గాజు బుడ్లలా వున్న కాంతిలేని కళ్ళు, నుదుట కుంకుమబొట్టు-వెరసి తన తల్లి జానకి.

తెలతెలవారుతుండగా ప్రారంభమయ్యే ఆమె దినచర్య రాత్రి పదివరకూ నిరాటంకంగా సాగుతూనే వుంటుంది ఇంటిపనులు, గేదె సంరక్షణ, ఇరుగిళ్ళకూ పొరుగిళ్ళకూ పాలు పోయటం, వంట చేయటం తీరిక సమయాల్లో కుట్టుమిషనుమీద పనిచేయటం, ఇన్ని చేస్తున్నా రవికి ఏ వేళకి ఏమి కావాలో జాగ్రత్తగా గమనించి అమర్చుతూ అతని చదువుకు అంతరాయం కలగకుండా చూడటం మాత్రం ఏమరదు

ఏదో ఆలోచిస్తున్నట్లు కూర్చున్న రవి నుండి సమాధానం ఆశించకుండా లోపలికి వెళ్ళిపోయింది జానకి.

గాటలోని గానుగలా నిరంతరం శ్రమిస్తున్న తల్లికి ఎప్పుడైనా సహాయం చేయబోతే వద్దంటుందామె. ఆవయసులో ఉన్న తల్లికి ఎదిగిన కూతురు దగ్గరుంటే ఎంత చేదోడు వాదోడుగా ఉంటుంది! ఆ తల్లికి ఎంత వెసులుబాటుగా ఉంటుంది!! అనుకుంటాడు రవి అప్పుడప్పుడు.

"రమ ఏం చేస్తుంటుందో! పెళ్ళి ఈడు వచ్చినపిల్ల. దాని పెళ్ళి విషయం ఏమైనా ఆలోచిస్తున్నారో లేదో" అని తల్లి తనలో తనే అనుకుంటున్నట్లు జానకి పైకి అనటం రవి వినకపోలేదు.

తల్లి రూపురేఖలను బట్టి రమ ఎలా వుంటుందో వూహించటానికి ప్రయత్నించాక రవి కదిలే నీటిలోని ప్రతిబింబంలా కదిలి చెదరి పోతోంది తన తోబుట్టువు రూపం!

ఇరవై ఏళ్ళు నిండుతున్న తను ఇంతవరకూ అక్కను చూడకపోవటం చెప్తే ఎవరూ నమ్మలేని నిజం!

రవికి నవ్వు వచ్చింది. తండ్రినే చూడలేదు తానింతవరకు. అక్కని చూడలేదని అనుకోవడమేమిటి?


అతడికి బాగా జ్ఞాపకం. ఎలిమెంటరీ స్కూల్లో చదివే రోజుల్లో తోటి పిల్లలంతా "మీ నాన్నగారు ఏం చేస్తుంటార్రా" అని అడిగేవాళ్ళు రవిని. జవాబుగా "ఏంచేస్తే నీకెందుకురా, అన్నీ నీకు చెప్పాలనివుందా" అని ఎదిరించేవాడు రవి జవాబు తెలీని, చెప్పలేని బూకరింపు అది.

ఒకరోజు తల్లిని అడిగేడు 'అమ్మా! నాన్న ఏడీ?"

జానకి కళ్ళనిండుగా నీరు నింపుకుని 'ఊరెళ్ళారు బాబూ! త్వరలో వస్తారు' అని జవాబు చెప్పింది జానకి.

రవి హైస్కూల్లో చేరాక ఒకరోజు బడికి వెళ్ళనంటూ మొరాయించాడు. కారణమేమిటని జానకి బుజ్జగించి అడిగిన మీదట చెప్పాడు రవి. "మీ నాన్నగారెప్పుడూ కన్పించడేంరా, అసలు ఉన్నాడా లేడా అని ప్రతివాడూ నన్ను అడుగుతున్నాడమ్మా! ఏం చెప్పాలో నాకు తోచకుండా వుంది.

జానకి వెంటనే జవాబు చెప్పలేదు. ఎదిగిన కొడుకుచేత అలా అడిగించుకోవలసిన దుస్థితి కలిగినందుకు తనలో తను దిగుళ్ళింది. కాని పైకి మాత్రం ఏమీ తొణకకుండా కట్టుకథ చెప్పి కొడుకును నమ్మించింది. "నీ తండ్రి రామకూరు అనే




పల్లెటూరులో ఉంటారు బాబూ! ఇక్కడికి ఇరవై మైళ్ళలో ఉందావూరు. ఆ వూళ్లో హైస్కూలు లేదు. నిన్ను చదివించాలనే పట్టుదలతో నేనివూరొచ్చి వుంటున్నాను నీ చదువు పూర్తయే వరకూ మనమా వూరు వెళ్ళటం పడదు.

"నాన్నగారి పేరు క్రిష్ణమూర్తి కదమ్మా"

రవి అడిగిన ప్రశ్నకు అవునన్నట్లు తల వూపింది జానకి.

"రవీ! రవీ! ఎంత పిల్చినా పలుకవేం? టీ తాగి వెళుదువుగాని రా" అంటూ పిల్చింది జానకి రవిని.

ఆలోచనల్ని దులుపుకుంటూ లేచి లోపలికి వెళ్ళాడు రవి.

టీలో పంచదార వేసి స్పూన్‌తో కలయ త్రిప్పుతోంది జానకి.

"జానకమ్మా? జానకమ్మా! ఎంత పని చేశావమ్మా" అంటూ లోపలికివచ్చారు శేషయ్యగారు.

శేషయ్యగారు జానకి తండ్రికి దగ్గర బంధువు. మంచి బ్రాహ్మడు. రామకూరులో ఉన్న పొలాల్ని కౌలుకు ఇచ్చి, నలుగురు కొడుకుల్నీ చదివించుకుంటూ ఆ వూళ్లో ఉంటున్నారు. పౌరోహిత్యంమీద కూడా బాగానే సంపాదిస్తున్నాడని నలుగురూ అనుకుంటుంటారు!

"ఏంటన్నయ్యగారూ నేనేంచేశాను?" నిర్ఘాంతపోతూ అడిగింది జానకి.

"రమకు పెళ్ళి అయిపోయిందటగా! నిన్న మనవూరు వెళ్తే తెలిసింది. నా చెవిన కాస్త వేస్తే వెళ్ళి భోజనం తిని వచ్చేవాడ్నిగా" శేషయ్యగారన్నారు.

"రమకు పెళ్ళయిందా? నాకు తెలీదే" జానకి ఆశ్చర్యంగా చూసింది. తన కూతురికి పెళ్ళి అయిందనే సంతోషమూ, ఆ శుభవార్త తనకు తెలియచేయలేదనే దిగులూ, కోపమూ ఆమె మొహంలో దోబూచులాడ సాగాయి.

"ఏమిటీ! నీకూ తెలీదా. పరిహాసమాడుతున్నావా?"

"లేదన్నయ్యగారూ! నిజం, నాకు తెలీనే తెలీదు". టీగ్లాసును శేషయ్యగారికి అందిస్తూ అంది జానకి.

రవి టీ త్రాగుతూ తల్లినీ, శేషయ్యగారినీ వింటున్నాడు.

"ఇది చాలా దారుణం జానకమ్మా? నేనేమో అనుకున్నాను గాని నీభర్త చాలా కఠినుడమ్మా. కోప తాపాలు అందరికీ వుంటాయి. కాని పట్టు, విడుపు లేకపోతే ఎలాగమ్మా. ఒక్క శుభలేఖ పంపితే వెళ్ళి చూసి వచ్చేదానివి కదా!"

జానకి చీర కొంగుతో కళ్ళు తుడుచుకొంది.

"పోనీలే తల్లీ. విచారపడకు. అమ్మాయి పెళ్ళి దివ్యంగా జరిగిందట. అబ్బాయికి అదేదో ఆఫీసులో ఉద్యోగమంట"

జానకికి దుఃఖం ఆగటంలేదు. పొరలి పొరలి వస్తోంది.

"క్రిష్ణమూర్తిది రాతిగుండే అనుకో. ఆయన తల్లి ముసలమ్మ ఉన్నదికదా! ఆవిడదీ స్త్రీ హృదయమే కదా! ఆవిడైనా చెప్పి పంపి ఉండవచ్చింది." అంటూ రవి వైపు తిరిగాడు శేషయ్యగారు.

అవునన్నట్లు సౌంజ్ఞ చేశాడు రవి.

"ఆవిడకసలు హృదయముంటేగదా అన్నయ్యగారూ! ఆవిడ స్త్రీ కాదు. పిశాచి. అసలు ఆవిడ మూలంగానేకదూ ఆయన అలా బరితెగించిపోయింది ? కన్నకొడుకు కన్పించిన ప్రతి ఆడదానితో రాసలీలలు జరుపుతుంటే తెలిసినప్పుడైనా కొడుకును మందలించిందా ? పైపెచ్చు నేనాయన చర్యల్ని గర్హిస్తూ పోట్లాడుతుంటే తను ఆయన్నే సమర్థిస్తూ మాట్లాడిందా ?అందుకేగా ఆయన నిండుచూలాలైన భార్యను ఇంటినుండి బయటకు తరిమింది? ఛీ....ఛీ.. వాళ్ళు మనుషులేనా? పగలంతా వేద పారాయణమూ, దైవపూజలు· చీకటిపడగానే కులమత విచక్షణ లేకుండా ఆడతోడును వెతుక్కోవడం."

రవిచిత్తరువులావింటూ కూర్చున్నాడు. తల్లి అంత ఆవేశంతో మాట్లాడటం ఇదివరకెన్నడూ చూడలేదు. ఆమె మాటలు విన్న రవికి ఆమె గతం కళ్ళకు కట్టినట్లు అర్థమైంది. భర్త నుండి ఆమె ఎందుకు దూరంగా ఉంటోందో అర్థమైంది. వివాహవ్యవస్థ, కౌటుంబిక కట్టుబాట్లు, వీటిని అర్థం చేసుకోనకుండా స్త్రీ పొందునే పరమావధిగా భావించి, విశృంఖలత తనకొక్కడికి సొంతమని భావించే వ్యక్తిని ఏ స్త్రీ భర్తగా గౌరవిస్తుంది. అలాంటివాడు తన భర్త అని తెలిసిన వెంటనే ఆ స్త్రీ అతడ్ని, అతని భర్తృత్వాన్ని వదిలి వెళ్ళిపోతుంది. తన తల్లి అలాగే చేసింది.

అన్నీవింటూ కూర్చున్న రవినిచూసింది జానకి. అప్పుడామెకు తన తప్పిదం తెలిసి వచ్చింది. ఆతనిముందు అతని తండ్రి అవినీతిని ఏకరువుపెట్టకుండా ఉండాల్సింది అనిపించింది. కాని.... ఇదీ ఒకందుకు మంచిదే అయింది. ఇన్నాళ్ళూ తను చెప్పలేక దాచిన యదార్థం ఈరోజు అతనికి తెలిసేలా చేసింది.

రవిని చూస్తుంటే ఆమెలో మెరుపు లాంటి ఆలోచన తళుక్కుమంది. అవును దెబ్బకు దెబ్బ!

"అన్నయ్యగారూ! వెంటనే రవికి ఉపనయనంచేయాలి. ముహూర్తం చూడండి. నాకు తెలీకుండా ఆయన నా కూతురు పెళ్ళి చేశాడు. ఆయనకు తెలీకుండా ఆయన కొడుక్కి ఉపనయనం జరిపి ఆ తర్వాత తెలియజేస్తా.ముందు ముహూర్తం చూడండి. పట్టుదలగా అంది జానకి.

శేషయ్యగారు ఆశ్చర్యపోయారు ఆమె ఆలోచనకు. "దాందేముంది- వచ్చే ఏకాదశి నాడు ముహూర్తముంది. ఆరోజు శంకర మఠంలో సాముహిక ఉపనయనాలు జరుపుతున్నారు. ఆ రోజే రవికి కూడా...."


"అవును అంతే" కసిగా అంది జానకి.

ఉపనయనం అయినమర్నాడు కాలేజీకి వెళ్ళిన రవికి కోట్రెడ్డి శుభలేఖ అందిస్తూ "ఎల్లుండే నాకు మేరేజి. తప్పకుండా రావాలి సుమా" అన్నాడు.

కోట్రెడ్డి కాలేజీ యూనియన్ సెక్రటరీ· స్నేహప్రియుడు.

శుభలేఖ చదువుకున్న రవి మనసులో ఏదో ఆలోచన చోటు చేసుకుంది.

స్నేహితుని పెళ్ళికి వెళ్తున్నానని చెప్పి




బయలుదేరాడుగాని, పెళ్లి రామకూరులోనే జరుగుతుందని చెప్పలేదు రవి, తల్లికి.

పెళ్లి కాగానే "క్రిష్ణమూర్తిగారిల్లెక్కడ" అని వాకబుచేసి ఆ యింటికి వెళ్లాడు రవి. తనకంటే పెద్దదైన తన తోబుట్టువును చూడాలనే కాంక్ష కలిగిందతనిలో. అయితే ఆ యింటికి వెళ్లాక తను ఎవరిని ఎలా సంబోధించాలో, ఏమని మాట్లాడాలో అతనికి తోచలేదు.

ఇంట్లోకి అడుగు పెడుతున్న రవిని చూస్తూనే "ఎవరు కావాలి?" అని ప్రశ్నించింది ఓ యువతి. రవి బదులు చెప్పకుండా ఆ యువతిలో తన తల్లి పోలికలున్నాయేమోనని చూడసాగేడు.

రవి అలా చూడటాన్ని అపార్థం చేసుకున్న ఆ యువతి భయంగా "నానెమ్మా.... ఎవరో వచ్చారు చూడు" అంటూ పిల్చింది. కొద్ది క్షణాల్లో నడుము వంగిపోయిన ఓ ముసలమ్మ బయటికి వచ్చింది. రవిని చూసి "ఎవరు బాబూ, ఏం కావాలి?" అని అడిగింది.

"జానకి తెలుసా మీకు?" ఆ ముసలమ్మను, ఆ యువతిని మార్చిమార్చి చూస్తూ అడిగేడు రవి.

ఒకప్పుడు ఈ యింటికోడలు జానకి"

"ఆ....ఆఁ ఆవిడ ఇప్పుడిక్కడ ఉండటం లేదు నాయనా, ఆవిడతో ఏం పని నీకు?"

"ఆవిడకో కూతురుండేది కదండీ...."

"ఆఁ రమ. ఈ అమ్మాయే" ముసలమ్మ అనుమానంగా చూస్తూ "అసలింతకీ నీ వెవరు?" అని అడిగింది.

రవి రమవైపు తిరిగి "నేను నీకు తమ్ముణ్ణి. నా పేరు రవి" అన్నాడు.

రమ కళ్ళు పెద్దవైనాయి. ఆనందం, ఆప్యాయత, వాత్సల్యం ఆమె కళ్ళలో తొంగి చూశాయి. అంతలోనే ఏదో భయం అనుమానం ఆందోళన కల్గి ముసలమ్మవైపు చూసింది.

అప్పుడే ఆ యింట్లోకి అడుగుపెట్టాడొక నడివయసుదాటిన వ్యక్తి. వస్తూనే అక్కడున్న ముగ్గుర్ని ప్రశ్నార్థకంగా చూడసాగేడు.

"నీ కొడుకొట్రా" అంది ముసలమ్మ లోపలికి వెళ్లిపోతూ.

ఒక్క క్షణంసేపు స్థాణువులా నిల్చుండిపోయాడు కృష్ణమూర్తి. అనుకోని సంఘ

టన జరిగినపుడు ఏం మాట్లాడాలో, ఎలా ప్రవర్తించాలో ఊహించని పరిస్థితి అతనిది.

కొంతసేపటికి తెరుకుని అన్నాడు కృష్ణమూర్తి "ఓహో! నీవా! రవికదూ నీపేరు? ఏం ఇలా వచ్చావు? మీఅమ్మ పంపించిందా, డబ్బేమైనా కావాలా? నాకు తెలుసు ఎప్పుడో ఓరోజు ఇలా జరుగుతుందని" హేళనగా వికటంగా నవ్వుతూ లోపలికి నడిచాడు

రవి మనసు చివుక్కుమంది. తండ్రి అనబడే ఆ వ్యక్తి నుండి ఆప్యాయత, అనురాగం, వాత్సల్యం కోటని ఆశించి రాలేదు తను కాని ఇలా హేళన, అవమానం ఎదురౌతాయని మాత్రం ఊహించలేదు. తనపైన, తన తల్లిపైన క్రిష్ణమూర్తి మాటల్లో వ్యక్తమైన చులకన భావం రవిలో అగ్నిని రగిల్చింది అక్కడే నిలబడి వున్న రమను చూసి తనలోని ఆవేశాన్ని అణచుకుని "అక్కా!" అన్నాడు.

రమ మనసు ఆర్ద్రమైంది. ఆమె కళ్ళు నీటితో నిండిపోయాయి. పొంగిపొరలుతున్న ఆప్యాయతకు భయం ఆనకట్ట వేయగా రెండడుగులు రవివైపు నడచి "తమ్ముడూ అమ్మ బాగుందా" అని అడిగింది. ఆ వెంటనే దుఃఖం ఆగకుండా ఆమెను ముంచేసింది.

"ఊర్కో అక్కా. అమ్మకేం. అమ్మ బాగానే వుంది ... పెళ్లి చేసుకున్నావుటగా. బావనెప్పుడు చూపించుతావ్" రవి నవ్వుతూ అడిగాడు.

పమిటకొంగుతో కళ్లు తుడుచుకుంటూ "కూర్చో రవీ. మీ బావ ఫోటో చూద్దువుగాని" అంటూ లోపలికెళ్లింది రమ. రమ చూపెట్టిన కుర్చీలో కూర్చోబోతున్న రవి లోపల్నుండి క్రిష్టమూర్తి రావటంతో ఆగిపోయాడు.

క్రిష్ణమూర్తి కుర్చీ తనవైపు లాక్కుని కూర్చున్నాడు. చుట్ట ఒకటి నోట్లో పెట్టుకుని వెలిగించుకుంటూ అన్నాడు "ఎందుకొచ్చినట్లో" అన్నాడు రవిని చూడకుండానే.

అతని వాలకాన్ని చూసిన రవికి సౌమ్యంగా జవాబు చెప్పాలనిపించలేదు. తను వచ్చిన పని అయిపోయింది. రమని చూశాడు. ఆమెలో తొంగిచూసిన వాత్సల్యాన్ని చవిచూసేడు. ఇక తనక్కడ పని లేదు.

"మీకిది చూపెడదామని...." పర్సు లోపలి యజ్ఞోపవీతాన్ని బయటికి లాగి చూపించాడు.

కృష్ణమూర్తి రవిని, అతని చేతిలోని యజ్ఞోపవీతాన్ని చూస్తూ వుండిపోయాడు.

రవి వరండా మెట్లు దిగి బయటకు నడిచాడు. కుర్చీలో కూర్చున్న క్రిష్ణమూర్తి, గుమ్మంలో నిల్చున్న రమ అలా చూస్తూనే వుండిపోయారు.

o o o

ఇది జరిగి సంవత్సరం గడిచింది.

రవి బి. కాం. పరీక్షలు వ్రాశాడు. ఫలితాల కోసం ఎదురు చూస్తున్నాడు.

తను రామకూరు వెళ్ళివచ్చిన సంగతి అక్కడ జరిగిన విషయాలు తల్లికి చెప్పేడు రవి. జానకి రమను గురించి ఏవేవో అడిగింది. రవి తనకు ఉపనయనం అయిందని తండ్రికి చెప్పిన తీరు ఆమెకు సంతృప్తిని కలిగించింది.

ఆరోజు జానకిపేర ఓ కవరొచ్చింది. అందులో క్రిష్ణమూర్తికి పక్షవాతం వచ్చిందని, ఊళ్ళోని ఆయుర్వేద వైద్యుడే మందులు వాడుతున్నాడని, ఒకసారి వచ్చి చూసి వెళ్లమని వుంది. ముసలమ్మ వ్రాయించిందా ఉత్తరం. క్రింద సంతకం లేదు.

పాతబడిపోయిన బాంధవ్యాల తంతుల్ని ఎవరో మీటినట్లయింది జానకికి.

"చూశావా రవీ! ముసలమ్మ తెలివితేటలు. రమకు పెళ్లి జరుగుతున్నప్పుడు నేను జ్ఞాపకం రాలేదు ఆమెకు. ఇప్పుడు కొడుకు పక్షవాతంతో మంచాన పడేసరికి ఆయన సంరక్షణకు నా అవసరం కలిగింది."

"వెళ్తావా అమ్మా!" రవి అడిగేడు.

"నాకు వెళ్లాలని లేదు బాబూ!" అన్నది జానకి.

○ ○ ○ ○

తెంచుకున్నామనుకున్న బంధం తానింకా తెగిపోలేదని తెలిపేది, తెరమరుగైన బాంధవ్యాన్ని చివరిసారిగా జ్ఞాపకం చేసేది ఒకే ఒక్క సంఘటన. మనిషి జీవితానికి చివరి సంఘటన. మరణం.

క్రిష్ణమూర్తి చనిపోయాడని కబురందింది.

జానకి ఏడవలేదు. మాటా పలుకూ లేకుండా కూర్చున్న చోటు నుండి కదలకుండా ఉండిపోయింది.

శేషయ్యగారు మరో యువకుడ్ని వెంటబెట్టుకుని అక్కడికి వచ్చాడు.

'విన్నావా జానకమ్మా' అంటూ కూర్చున్నాడు. జానకి మాట్లాడలేదు. రవి మాట్లాడలేదు

"పాపం పక్షవాతం వచ్చాక కూడా రెండేళ్లు మంచంలోనే వున్నాట్ట. ఆ రెండు ఏళ్లూ నరక యాతన అనుభవించాట్ట. రమ కాపురానికి వెళ్ళింది. తల్లికి పెద్ద తనం. అన్నీ మంచంలోనే జరగబోస్తుంటే సరికి సంరక్షణ చేయలేక విసుక్కోవడం మొదలెట్టిందిట ముసలమ్మ. ఏమైతేనేం ఆయన బ్రతుకు కడతేరింది." శేషయ్యగారు ఆగేడు. ఎవరూ ఏమి మాట్లాడలేదు.

"ఇతనెవరో తెలుసా, నీ అల్లుడేనమ్మా రమ భర్త. ముసలమ్మ చెప్పి పంపింది. నిన్నూ, అబ్బాయిని తీసుకు రమ్మని."

"ఎందుకు?" రవి ప్రశ్నించాడు.


100 ml బాటిలు కొని

**87 పైసలు ఆదా చేసుకోండి**

# 'క్రివేణి' ఇంకు

ఇప్పుడు లాభకరమైన ప్యాకింగులో
100ml పాలిథీన్ బాటిల్సులో దొరుకుచున్నది.
100ml బాటిలు 1కి వెల రు. 2-80
60ml బాటిలు 1కి వెల రు 2-20
(స్థానిక పన్నులు అదనం)
వినియోగదార్ల లాభమునకుగాను ప్రకటించుచున్నాము.




తయారు చేయువారు :
**కృష్ణవేణి ఇంకు ఫ్యాక్టరీ**
751, తిరువత్తియూరు హైరోడ్, మద్రాసు-600081

"ఎందుకేమిటోయ్. ఒక్కగానొక్క కొడుకువి రక్తసంబంధం. మీ నాన్నకి అంత్యక్రియలు జరిపి రుణం తీర్చుకో!" శేషయ్యగారు ఆదేశిస్తున్నట్లు చెప్పాడు.

"నేనాయనకేమీ రుణపడలేదు. ఒకవేళ ఏదైనా రుణమున్నా అది ఈ ఇరవై సంవత్సరాల కాలదోషం పట్టిపోయింది" రవి నిర్మొహమాటంగా అన్నాడు.

"అలా అనుకుంటే సరిపోదు రవీ! తెంచుకుంటే పోయేదికాదు బాంధవ్యం. తండ్రి ఎంత దుర్మార్గుడైనా, తనయుడిగా నీ బాధ్యత నువు నెరవేర్చక తప్పదు."

"నా బాధ్యత నాకు తెలుసు" విసురుగా లేచి పెరటివైపు నడిచాడు.

చల్లని తన నీడకు రమ్మని ఆహ్వానిస్తోంది మామిడిచెట్టు.

తను ఈవూరు వచ్చినప్పుడు తల్లి నాటిన మొక్క అది. ఈరోజుకది శాఖోపశాఖలుగా విస్తరించి చల్లనినీడనూ ఇస్తోంది. తీయని కాయల్నీ ఇస్తోంది.

చెట్టుపై కాకులు గోలగోలగా అరుస్తున్నాయి. అక్కడవున్న కాకిగూడుచుట్టూ చేరవున్నాయి ఎన్నో కాకులు.

అప్పుడే గూటిలో నుంచి బయటికి వచ్చిన కోకిలపిల్లను వింతగా, కోపంగా చూస్తున్నాయి కాకులు.

కాకిగూటిలో కోయిలపిల్ల. తనను వేరుగా చూడకుండా వుండివుంటే కోకిల పిల్ల మిగతా కాకిపిల్లలతో అక్కడేవుండి పోయేదేమో. కాని తనని వేరుగా చూడటంతో తనకిక అక్కడ స్థానం లేదనుకుంది. అటుఇటూ చూసి తుర్రుమని వెళ్ళిపోయింది. తనకు జన్మనిచ్చిన గూటిని, కాకితల్లిని ఎంత తేలిగ్గా విడిచిపోయింది!

అందులో స్వార్థంలేదు. ద్రోహమూ లేదు. తననూ, తన జాతినీ సంరక్షించుకునే ప్రయత్నంలోనే అలా చేసింది. రవికి ఏదో అర్థం స్ఫురించింది కోకిల కాకిగూటిని వదిలిపెట్టటంలో.

"రవీ! ఇలారా"

తల్లి పిలుపువిని లోపలికి నడిచాడు రవి.

శేషయ్యగారు తిరిగి చెప్పటం మొదలెట్టాడు.

"క్రిష్ణమూర్తి ఎంత కఠినుడైనా నీకు తండ్రి, మీ అమ్మకు భర్త. అతని అవినీతి వర్తనం మీద అలిగి ఆవిడ ఈ ఇరవై ఏళ్లుగా విడిగా ఉన్నా, అనుబంధం అంటూ ఒకటుందిగదా! అందుకే వెళ్ళి భర్తను కడసారిగా చూసి రావాలని నిర్ణయించుకుంది నీవుకూడా ఆమెతో వెళ్ళి ఆయనకు అంత్యక్రియలుజరిపివస్తే బాగుంటుందని నా అభిప్రాయం"

"నా అభిప్రాయం కూడా చెప్పేను కదండీ - వెళ్ళితీరాలనేటంత అనుబంధం నాకేం కన్పించలేదు." దృఢంగా అన్నాడు రవి.

"అలా అనుకుంటే ఎలా? ఈరోజు నుంచీ నీవు క్రిష్ణమూర్తి ఆస్తికంతటికీ వారసుడివి. పై చదువులు చదవడానికైనా, ఉద్యోగం వచ్చేవరకూ జరుగుబాటుకైనా నీకేలోటూ వుండదు. ఆలోచించుకోమరి"

"నేనన్నీ ఆలోచించే చెప్పాను. అగ్నిసాక్షిగా పెండ్లాడిన భార్యనుకాదని అవినీతిగా కాముక ప్రవృత్తే ధ్యేయం పెట్టుకున్న ఆ కృష్ణమూర్తి వారసత్వం నాకొద్దుగాక వద్దు, ఇక, అమ్మవెళ్ళి కడసారి తన భర్తను చూసివస్తానంటే ఆమె సెంటిమెంటుకు నే నడ్డురాను." అంటూ బయటకు వెళిపోయాడు రవి.

అక్కడున్న ముగ్గురూ వెళ్తున్న అతనివైపు అలా చూస్తూనే వున్నారు.